క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి విశేష పూజలు


పూజలందుకున్న స్వామివారు

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీకోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అర్చకులు అభిషేకాలు, అర్చనలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానికులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు కొండపై భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి


కొరప్రోలూరు గ్రామంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

గడివేముల: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని నియోజకవర్గ అభివృద్ధి అధికారి, ప్రత్యేక కలెక్టర్ ఉమామహేశ్వరి కోరారు. శనివారం మండల పరిధిలోని కొరప్రోలురు గ్రామంలో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం, పశువుల కొరకు నీటి తొట్టిలు ఏర్పాటు చేశారు. అనంతరం ఇంటి పరిసరాలు, గ్రామం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల్ స్పెషల్ ఆఫీసర్ జవహర్ బాబు, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారు-ఆర్టీసీ బస్సు ఢీ

● ఒకరికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

కోడుమూరు రూరల్: కోడుమూరు-కర్నూలు మార్గంలోని ప్యాలకుర్తి సమీపంలో శనివారం కారు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. కోడుమూరుకు చెందిన షబ్బీర్ వ్యక్తిగత పనిపై కారులో కర్నూలుకు వెళ్లి తిరిగివస్తుండగా, ప్యాలకుర్తి వద్ద ఎదురుగా వస్తున్న పత్తికొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న షబ్బీర్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

మూడో రోజు కొనసాగిన శిక్షణ తరగతులు

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా స్థాయి శిక్షణ తరగుతులు మూడో రోజు శనివారం కూడా జరిగాయి. స్థానిక విశ్వనారాయణ జూనియర్ కాలేజీలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో 40 మంది కళాకారులు శిక్షణ పొందతున్నారు. కర్నూలు జిల్లా సీపీఐ జిల్లా మహాసభల సందర్భంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. శిక్షణ తరగతులు కళాకారులను చైతన్యం చేయడానికి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ పట్టణ మండల కార్యదర్శి సుదర్శన్, కల్లుబావిరాజు, ప్రజా నాట్యమండలి జిల్లా ఆఫీస్ బేరర్స్ మాణిక్యం, బద్రి, శివ రాముడు, రఘు తదితరులు పాల్గొన్నారు.

1న రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఈత పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 1 వ తేదీ నరసరావుపేటలో 10 వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఈత సంఘం సంయుక్త కార్యదర్శి రామక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల మధ్యలో పుట్టిన స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 18 వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 10 గంటల మధ్యన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనులో సంప్రందించాలని సూచించారు. పాల్గొన దలచిన ఈత క్రీడాకారులు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్డు తప్పక కలిగి ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 85000 54005 సెల్ నంబర్ సంప్రదించాలని చెప్పారు.

యువకుడి దుర్మరణం

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిగురమానుపేటకు చెందిన మణిధర్ కుమారుడు జానీ(24) మృతి చెందాడు. వర్షం కురుస్తున్న సమయంలో బైక్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళుతుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు.

పశువుల ఎరువుతో భూసారం పెంపు

● వేసవి దుక్కులతో మేలు
● అధిక దిగుబడులు సాధించవచ్చు
● మండలంలో జోరుగా పశువుల ఎరువు వాడుతున్న రైతులు


పశువుల ఎరువును ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

గడివేముల: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతుల్యత లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపం దిగుబడులపై ప్రభావం చూపుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు.

23 వేల ఎకరాల సాగుభూమి

మండలంలో 16 గ్రామపంచాయతీల్లో 23 వేల భూమి ఉంది. ప్రతి సీజన్ లో దాదాపు 20 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఉండుట్ల, ఎల్ కే తండా , కొరప్రోలూరు, బొల్లవరం ,గని, గ్రామాల్లో ఆవులు, పశువులు, గొర్రెలు అధికంగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో తమ పొలాలకు పశువుల ఎరువునే వాడుతున్నారు.

వేసవి దిక్కికి ముందే..

పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది సేంద్రియ ఎరువులతో సమానం. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పం ట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. ఎకరాకి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

భూసారం పదిలం...

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో జల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నిటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందే విధంగా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

వాలుకు అడ్డంగా దున్నాలి

పొలాన్ని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవి కాలంలో మెట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందు కంటే వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సార వంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.

భూసారం పెరుగుతుంది



పశువులు, మేకలు, గొర్ ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన పోషకాలు అందుతాయి. నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందే విధంగా సహాయపడతాయి. రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

– హేమ సుందర్ రెడ్డి, ఏఓ, గడివేముల.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 21న డీఈఓ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్ తెలిపారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సంఘ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ పరిరక్షణకై, ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు ప్రసన్నరాజు, అడివన్న, ఎల్లప్ప, రామచంద్ర, నాగభూషణం, వెంకట్రాముడు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యార్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగభద్రత కల్పించాలని ఆ అసోసియేషన్ నేతలు మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీతను కోరారు. మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, యార్డ్ అసిస్టెంట్లు మరణిస్తే కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ అన్ని విషయాలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసిన్ నాయకులు పీవీ కిరణ్, నాగరాజు, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో రక్తపోటు దూరం


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోడుమూరు రూరల్: ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని జిల్లా అసంక్రమిత వ్యాధుల కార్య నిర్వహణ అధికారి శైలేష్‌కుమార్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడుమూరులో వైద్య సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శైలేష్ కుమార్ మాట్లాడుతూ.. శారీరక శ్రమ లేకపోవడం, జీవనశైలిలో మార్పులు, పనిభారం, ఆహారపు అలవాట్ల వల్ల అధిక రక్తపోటుకు గురై ప్రపంచంలో ఏటా 10 లక్షలకు పైగా జనాలు చనిపోతున్నారన్నారు. కావున ప్రజలంతా శారీరక శ్రమ చేయడంతో పాటు, పొగాకు ఉత్పత్తులు, మద్యం అలవాట్లకు దూరంగా ఉండడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రక్తపోటు నివారణలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఎన్‌సీడీ సర్వే నిర్వహించి రక్తపోటు ఉన్న వారిని గుర్తించి మందులను అందజేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ మల్లికార్జున, జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ సుధాకర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు కమాల్‌సాహెబ్, ఉమాభాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


సి.బెళగల్: పొదుపు మహిళలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ


పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

సి.బెళగల్: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. శనివారం సి.బెళగల్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, మండల అధికారులు, సర్పంచ్ పాండురంగన్న తదితరులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పొదుపు మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయం ఎదుట మానవహారంగా ఏర్పడి పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై మాట్లాడారు. తర్వాత ప్రధాన రోడ్లలో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమల నివారణ సాధ్యమని.. తద్వారా వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, టీఏలు, వెలుగు సీసీలు, పొదుపు మహిళలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ద్రవిడ యూనివర్సిటీ వీసీ ఎం.దొరస్వామి నాయుడు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కుప్పం ద్రవిడ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి నాయుడు అన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను వీసీతో పాటు తిరుపతి ఎస్వీయూ ప్రొఫెసర్ కె.సురేంద్ర బాబు, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, గ్రంథాలయ శిక్షణాలయం అధినేత రాష్ట్ర గ్రంథాలయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావి శారద, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, గాడిచర్ల హరిసర్వోత్తమరావు మనుమడు మనోహర్‌రావు తదితరులు సందర్శించారు. గ్రంథాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గ్రంథాలయం నిర్వహణ బాగుందని అభినందించారు. అంతకు ముందు గాడిచర్ల విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.గోవిందరెడ్డి, ఎస్ బాషా, రేణుక, శీను, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి

● జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా
● పాణ్యంలో స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర


ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన బెంచ్‌పై కూర్చున్న కలెక్టర్, అధికారులు

పాణ్యం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా పిలుపునిచ్చారు. శనివారం పాణ్యంలోని నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. నీటిని వృథా చేయరాదని, ప్లాస్టిక్ వస్తువులను ఉపయోగించరాదని సూచించారు. అనంతరం పాణ్యంలోని మార్కెట్ యార్డులో చెత్తను ఎత్తి బుట్టలో వేసి తరలించారు. అక్కడే మహిళలతో మాట్లాడారు.

ప్రయాణికులకు సౌకర్యాలు

పాణ్యం బస్టాండ్‌లోని ప్రయాణికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రయాణికులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగేలా చలువ పందిళ్లు, మరుగుదొడ్లు నిర్మాణం, మంచినీటి సౌకర్యం తదితర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తి అధికారులను ఆదేశించారు. బస్ షెల్టర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను తనిఖీ చేసి.. మందులు, వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు.

చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

ప్రతి రోజు ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరగాలని పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాణ్యంలో దాదాపు 4వేలకు ఇళ్లు ఉండగా రోజు 2 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ చేసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్న క్రమంలో వర్మీ యూనిట్‌లో తడి, పొడి చెత్తను వేరుగా చేసి ఎరువును తయారు చేసి విక్రయించాలన్నారు. అంతేకాక ప్లాస్టిక్, గాజు, ఇనుప ముక్కలు తదితర వాటిని కూడా ముక్కలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నందున ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటి, ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన బెంచ్‌ను తిలకించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీపీఓ శివారెడ్డి, ఎంపీపీ ఉసేనీబీ, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ ఈఓఆర్డీ చంద్రమౌళీశ్వర్‌గౌడ్, ఎంఈఓ కోటయ్య, ఏపీఓ శేషన్న, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ మధుశేఖర్, డాక్టర్ అభిషేక్, ఈఓ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


చెత్త ఎత్తుతున్న కలెక్టర్ రాజకుమారి

22న హనుమాన్ జయంతి

కర్నూలు కల్చరల్: సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సాయంత్రం 5.30 గంటల నుంచి రామాయణ పారాయణం, ధార్మిక ప్రసంగాలు, హనుమాన్ చాలీషా పారాయణం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా యుద్ధం విజయోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, భారత త్రివిధ దళాలకు సంఘీ భావం తెలుపుతూ ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ రక్షణ దళానికి మరింత బలం, శక్తిని కలిగించి విజయం ఎల్లవేళలా చేకూరాలని స్వామి వారిని స్మరించుకుంటూ హనుమాన్ చాలీషా పారాయణం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

గోల్డెన్ అవర్ ఎంతో ముఖ్యం


అత్యవసర వైద్యంపై శిక్షణ పొందిన వైద్యులు, విద్యార్థులతో అధికారులు

కర్నూలు(హాస్పిటల్): హార్ట్ అటాక్ విషయంలో గోల్డెన్ అవర్ ఎంతో ముఖ్యమని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. వైద్యుల్లో నైపుణ్యాలను అప్‌డేట్ చేసేందుకే నిరంతర శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీలో అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో పీజీ వైద్యులకు రెండు రోజులుగా ×కాంప్రహెన్సివ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్౽పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ విషయంలో గోల్డెన్ అవర్ చాలా ముఖ్యమని, ఎంత త్వరగా రోగికి వైద్యం ప్రారంభిస్తే అంత మెరుగైన ఫలితాలు ఉంటాయని ఆమె చెప్పారు. అందువల్లే ఈ అంశంపై నూతనంగా వస్తున్న మెలకువలను వైద్యులకు నేర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలకు గుండెనొప్పి విషయంలో అనేక అపోహలు ఉన్నాయని, అత్యవసర సమయంలో సమయం వృథా కాకుండా వైద్యులు చికిత్సకు ఉపకరించేందుకు వారికి మెలకువలు నేర్పించడం ద్వారా రోగులకు సత్వర వైద్యసహాయం అంది ప్రాణాలు కాపాడటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అనెస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ విశాల, ప్రొఫెసర్ డాక్టర్ సుధీర్‌కుమార్, ప్రొఫెసర్ అండ్ ట్రెనింగ్ డైరెక్టర్ రామశివనాయక్, కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ రాణి మంజూష, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

వేసవి తాపంపై 'బీట్ ద హీట్'


బీట్ ద హీట్‌పై ప్రదర్శన ఇస్తున్న వైద్య విద్యార్థులు, పాల్గొన్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): వేసవి ఎండల దృష్ట్యా ప్రజలను జాగృతం చేసే కార్యక్రమంలో భాగంగా ×బీట్ ద హీట్౽ అంటూ శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఇంటర్నీస్ వైద్య విద్యార్థులు చక్కటి స్కిట్ ప్రదర్శించారు. వడదెబ్బ తగిలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, తమ ఇంటిలో, గ్రామంలో ఎలాంటి ప్రథమ చికిత్స చేయవచ్చు, ఏ పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రికి తరలించాలి అన్న అంశాల గురించి స్కిట్‌లో ప్రదర్శించారు. అనంతరం వారిచే ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ సింధియా శుభప్రద, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి పాల్గొన్నారు.



మాలవీధిలో కూలిపోయిన గుడిసె ముందు దీనంగా బిక్కుబిక్కుమంటూ ఉన్న బజారి కుటుంబ సభ్యులు, గాలులకు మాలవీధిలో ఎగిరిపోయిన గుడిసె పైకప్పు

గాలివాన బీభత్సం

● నేలకూలిన కరెంట్ స్తంభాలు, చెట్లు
● ఈదురుగాలులకు ఎగిరిపోయిన రేకుల షెడ్లు
● నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

కోడుమూరు రూరల్: కోడుమూరులో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంట పాటు అతలాకుతలం చేసింది. గాలివాన సృష్టించిన బీభత్సానికి పట్టణంలోని బీసీ, ఎస్సీ, తేరు బజార్, మాలవీధి, మెమీన్ వీధుల్లో నివాసాల రేకులషెడ్లు, పూరి గుడిసెలు ఎగిరిపోవడంతో చిమ్మచీకటిలో ప్రజలు తలదాచుకునేందుకు దిక్కులు పరుగెత్తాల్సిన పరిస్థితి దాపురించింది. భారీ ఈదురుగాలులకు ఎక్కడికక్కడ చెట్లు కూలిపోగా, కరెంట్ స్తంభాలు నేలకూలడంతో కరెంట్ తీగలు తెగిపోయి రాత్రంతా కరెంట్ లేక పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో గాలులకు నేలకూలిన 6 కరెంట్ స్తంభాలను విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి కొత్త స్తంభాలను వేయడంతో పాటు, తీగలను లాగి శనివారం మధ్యాహ్నానికి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే ప్యాలకుర్తిలోనూ ఈదురుగాలులకు వ్యవసాయానికి సంబంధించిన మూడు కరెంట్ స్తంభాలు నేలకూలాయి.

వీధిన పడ్డ కుటుంబం

గాలివాన సృష్టించిన బీభత్సానికి కోడుమూరు మాలవీధిలో నిరుపేదలైన బోయ బజారి, సాలమ్మ దంపతులకు చెందిన పూరి గుడిసె పూర్తిగా కూలిపోయింది. ఇంట్లో నిద్రిస్తుండగా గాలివానకు గోడ లోపలకు పడకుండా బయటకు పడడంతో ఆ కుటుంబం పెను ప్రమాదం నుంచి ప్రాణాలతో బయట పడింది. కూలినాలి చేసుకుని జీవించే బజారి, సాలమ్మలు పిల్లపాపలతో నిలువనీడ కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. తమకు ప్రభుత్వం సాయమందించి ఆదుకోవాలంటూ దీనంగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు రాముడు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.


బేపారం వీధిలో గాలులకు ఎగిరిపోయిన మదర్సా రేకుల షెడ్డు


తేరుబజార్‌లో ఎగిరిపోయి రోడ్డుపై పడ్డ రేకుల షెడ్డు


ఈదురుగాలులకు కోటవీధిలో నేలకూలిన చెట్లు

20న బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని బావిపల్లి గ్రామంలో ఈ నెల 20వ తేదీ బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పోటీ లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు,రూ.30వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలతో పాటు మొత్తం 12 బహుమతులు ఉంటాయన్నారు. 6305427212, 6304108994 నంబర్లను సంప్రదించాలన్నారు.